క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్రస్థాయి బాలల శిబిరం

చీరాల రూరల్: ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ సంఘం (ఏఈఎల్‌సీ) అంతర్ రాష్ట్రీయ సండే స్కూలు బాలల శిబిరం నేటి నుంచి మూడు రోజుల పాటు స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్ తెలిపారు. శిబిరానికి సంబంధించిన పోస్టర్లను చర్చి పాస్టర్లు రెవరెండ్ పిల్లి దేవదాసు, పోకూరి నాని బాబులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చర్చి చైర్మన్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ శిబిరానికి హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ సంఘాలకు సంబంధించిన అన్ని చర్చిల నుంచి 4 వేల మంది బాల, బాలికలు హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చర్చి ట్రెజరర్ పేర్లి ఆనంద్‌బాబు, క్యాంపు ట్రెజరర్ సంపత్, దేటా దివాకర్, పీసీసీ, ఎల్‌సీసీ, సంఘస్తులు పాల్గొన్నారు.

హరిదాసులకు సన్మానం



చీరాల: రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో సంక్రాంతి భోగి పండుగను పురస్కరించుకొని హరిదాసులను దుశ్శాలువాలతో మండలి అధ్యక్షుడు గోకుల కిరణ్‌బాబు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల నమ్మకం ప్రకారం హరిదాసు అనగా పరమాత్మతో సమానం, మానవులు ఇచ్చే దానధర్మాలు అందుకొని ఆయురారోగ్యాలు భోగభాగ్యాలతో ఉండాలని దీవించే వారు హరిదాసులన్నారు. అనంతరం వారికి దుప్పట్లు, మిఠాయిలు అందజేశారు.

మాధవస్వామికి వెండి పాదాలు అందజేత

అద్దంకి రూరల్: అద్దంకిలో వేంచేసియున్న భూదేవి, శ్రీదేవి సమేత మాధవస్వామికి స్థానిక చామర్తి బజార్‌కు చెందిన చామర్తి లక్ష్మీ విశ్వనాథ్, నాగమణి దంపతులు సోమవారం రూ. 70 వేల విలువగల వెండి పాదాలను స్వామివారికి అందజేశారు. అనంతరం దేవస్థాన అర్చకులు దాతలను ఆశీర్వదించారు.

మాదిగ ఉద్యోగులు మరింత సంఘటితం కావాలి

చీరాల: మాదిగ ఉద్యోగులు మరింత సంఘటితం కావాల ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు వంగేవరపు రమేష్ మాదిగ పేర్కొన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సీనియర్ నాయకులు మాజీ పార్లమెంట్ సభ్యుడు మంద జగన్నాథం మృతికి నివాళులర్పించారు. ఉద్యోగులు సహకారాన్ని భవిష్యత్‌లో మరింతగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల జాతీయ సమాఖ్య ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాసు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు బుడగుంట్ల లక్ష్మీ, నరసయ్య, కత్తి ఐజాక్, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు వందనం పాల్గొన్నారు.

రోటరీ సేవలు విస్తృతం చేయాలి

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి అన్నారు. క్లబ్ గవర్నర్ అధికార పర్యటనలో భాగంగా చీరాల వచ్చిన సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక రోటరీ క్లబ్ భవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. చీరాల రోటరీ క్లబ్ 72 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందని, భవిష్యత్తులో పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. న్యాయవాది బి.హేమంత్‌కుమార్ ఆర్థిక సహాయంతో దత్తాత్రేయ స్వామి క్షేత్రానికి ఐదు సీలింగ్ ఫ్యాన్లు గవర్నర్ చేతుల మీదగా అందించారు. కార్యక్రమంలో చందలూరి బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, కరణం శ్రీనివాసబాబు, సురేష్, గుర్రం రాఘవరావు, వలివేటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటలు.. కొత్తవెలుగులు



- ఘనంగా భోగి పండుగ
- ప్రతి ఇంటిముందు భోగి మంటలు
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు, యువత
- ఆకట్టుకున్న రంగవల్లులు

మార్టూరు/కారంచేడు/యద్దనపూడి/చినగంజాం: తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజుల పండుగలో భాగంగా మొదటి రోజు నిర్వహించే భోగి ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రజలు వేకువ జామునే నిద్ర లేచి తమ గృహాల ముందుభోగి మంటలు సిద్ధం చేసి పండగ నిర్వహించారు. పలు గ్రామాల్లో ప్రజలు వీధిలోని కుటుంబాలు అంతా కలిసి ఎంతో ఉత్సాహంగా భోగి మంటలు వేసుకొని కేరింతలు కొట్టారు. గ్రామాల్లో పలువురు యువకులు గ్రామ ప్రధాన కూడలిలో భోగి మంటలు వేసి డీజే పాటలతో హుషారుగా చిందులు వేస్తూ పండుగను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. భోగి మంటల్లో ఇంట్లోని ఉపయోగంలో లేని పాత వస్తువులను తెచ్చి తగుల బెట్టారు. భోగి పండుగను చిన్నా, పెద్ద, యువకులు, యువతులు, అందరూ కలిసి ఆనందంగా నిర్వహించుకున్నారు. తమ ఇంట్లో కొత్తవెలుగులు రావాలని కోరుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు వెళ్లారు.

✦ మండల కేంద్రమైన కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, ఆదిపూడి, యర్రంవారిపాలెం, తిమిడెదపాడు, దగ్గుబాడు గ్రామాల్లో ప్రజలు రోడ్లపైనే భోగి మంటలు వేసుకున్నారు. కారంచేడు పెద బజారు, చినవంతెన సెంటర్, మాస్కో బజారు, కాలువ సెంటర్, బండెలదొడ్డి బజారుల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. వీరితో పాటు ఈ ఏడాది ఎక్కువగా ఇతర ప్రాంతాల నుండి వచ్చిన బంధువుల సమక్షంలో ఈ భోగి పండుగను భక్తి, శ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

✦ యద్దనపూడి మండలంలో భోగిపండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భోగిమంటల్లో అవుపిడకల దండలు వేసి సంప్రదాయాన్ని చాటారు. చిన్నపిల్లలకు భోగిపండ్లు వేసి ఆశీర్వచనాలు అందించారు. పూసూరులోని పెద్ద బజారులో సంక్రాంతి సంబరాల కమిటీ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు, మహిళలకు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. వేకువజామునే భోగిమంటల చుట్టూ కోలాటమాడారు. సాయంత్రం గోదారంగనాథుల కల్యాణం నిర్వహించారు.

భోగి మంటల వద్ద హరిదాసుల నృత్యాలు

చీరాల అర్బన్/వేటపాలెం: సంక్రాంతి పండుగ సంబరాలను పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భోగి పండుగ సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో భోగి మంటలు వేశారు. పట్టణంలోని సంతబజారులోని గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి వేడుకల్లో మంటల ముందు మహిళలు, యువత సందడి చేశారు. హరిదాసులు, గంగిరెద్దులు నృత్యాలతో సంబరాలను నిర్వహించారు. భోగి పండుగ నాటికి అమ్మవారి అనుగ్రహం రేగు పండులోకి ప్రవేశిస్తుందని, చిన్న పిల్లలకు జాతకరీత్యా ఏమైనా ఇబ్బందులుంటే తొలగించడానికి వాళులు కూర్చొని యజ్ఞయాగాలు చేయలేరు. చిల్లర పైసలు, బంతిపూలు, రేగుపళ్లు, చెరుకు ముక్కలు, కొబ్బరి ముక్కలు ఇటువంటివి కలిపి పెద్దవాళ్లు పిల్లలని కూర్చోబెట్టి వాళ్ళ మీద నుంచి ఆ పదార్థాలను కిందకి విడిచి పెడతారు. అలా పై నుంచి కిందకు పడితే పీడలు తొలగిపోయి సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటారని పెద్దలు చెబుతారు. భోగి రోజున పిల్లలకు రేగుపండ్లతో భోగి పండ్లు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీంతో రేగు పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఏర్పడింది. కేజీ డబ్బా రూ.200 వరకు పలికింది.

✦ భోగి పండుగ సందర్భంగా సోమవారం స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద వేంచేసియున్న వీరరాఘవస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులను వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. అర్చకులు దిట్టకవి వాసు దేవాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేటపాలెం మండల పరిధిలోని గ్రామాల్లో భోగి పండుగ ఇంటింటా ఘనంగా నిర్వహించారు.

చిన్నారులకు భోగిపండ్లు..



మల్లాయపాలెంలో భోగి పండ్ల కార్యక్రమం

అద్దంకి/బల్లికురవ/మేదరమెట్ల/జే.పంగులూరు/అద్దంకి రూరల్: తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతిలో భాగంగా సోమవారం ప్రజలంతా భోగి పండుగను ఘనంగా జరపుకున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామివారి దేవస్థానం నందు భోగి పండుగ సందర్భంగా దేవస్థానంలో తెల్లవారు జామున 5 గంటలకు భోగి మంటలు ఏర్పాటు చేశారు. ముందుగా దేవస్థానం రాజగోపురం వద్ద గోమయంతో కళ్లాపుచల్లి వివిధ రకాల రంగులతో ముగ్గులు వేసి దానిపై కట్టెలు ఏర్పాటు చేసి ఆవు నెయ్యి కర్పూరంతో దేవస్థానం కార్యనిర్వహణాధికారి మదమంచి తిమ్మానాయుడు వేద పండితులు అర్చకులు మంత్రోచ్చారణ మంగళవాయిద్యాలు మ్రోగుతుండుగా భోగి మంటలను వెలిగించారు.



భావన్నారాయణస్వామి ఆలయంలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న పెద్దలు

✦ బల్లికురవలో పండుగ సందర్భంగా సాయంత్రం చిన్నారులకు దిష్టిదోషాలు తొలగి ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ముత్తైదువులను పిలిచి భోగి పండ్లు పోసి పేరంటాళ్లు నిర్వహించారు.



శింగరకొండలో భోగి మంటలు వేస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది



అద్దంకిలో భోగిమంటలు వేస్తున్న చిన్నారులు



సంతమాగులూరు మండలంలోని మక్కెన వారిపాలెం గ్రామంలోని భోగిమంట



వేటపాలెంలో భోగి మంటల వద్ద ఆనందంగా యువకులు



మార్టూరులో భోగిమంటలు వేస్తున్న ప్రజలు



పూసూరులో కోలాటమాడుతున్న మహిళలు



చీరాల కాలువ సెంటర్‌లో భోగి మంటలు వేస్తున్న వాకర్స్ సభ్యులు

వైభవంగా గోదా రంగనాథస్వాముల కల్యాణం

చినగంజాం: ధనుర్మాసం చివరి రోజు స్థానిక భావన్నారాయణస్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాయక స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మోహన లక్ష్మీ నరసింహాచార్యులు వేద మంత్రాల నడుమ మాజేటి మురళి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయ దాతలుగా అర్వపల్లి రమాకుమార్ కుమారులు అర్వపల్లి శ్రీకాంత్, లక్ష్మీదీప్తిలు పాల్గొని పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శివనారాయణ, రామానుజం, జీ పిచ్చయ్య పాల్గొన్నారు.

కారంచేడు: మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, దగ్గుబాడు, స్వర్ణ గ్రామాల్లో ధనుర్మాస వ్రతం అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కారంచేడు హరేరామ జపయజ్ఞ ఆశ్రమం, గంగమ్మగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణ గ్రామంలో కొలువై ఉన్న భూసహిత వల్లభరాయస్వామి వారి దేవస్థానం గోదాదేవి కల్యాణం, ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు.

చీరాల అర్బన్: ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని వేంచేసియున్న లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మహిళా భక్తులు గోదాదేవికి ధనుర్మాస సారె సమర్పించారు. నెల రోజులు పాటు ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో మహిళలచే తిరుప్పావై పఠనం నిర్వహించారు. చివరి రోజు 32 పూలు, పండ్లు, స్వీట్లు, ఇతర ఫలాలతో గోదాదేవికి మహిళలు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మేదరమెట్లలో గోదా రంగనాథస్వాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదాదేవి రంగనాథస్వాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక నాభిశిల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ

మేదరమెట్ల: చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ చేశారు. కొరిశపాడు మండలం రావినూతల జెడ్పీహెచ్ఎస్‌లో ఈనెల గత నెల 22వ తేదీన యలగాల సుబ్బారావు ప్రతిభ స్మారక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు అద్దంకి, బల్లికురవ, కొరిశపాడు, జే.పంగులూరు, ఇంకొల్లు మండలాల విద్యార్థులకు నిర్వహించారు. 52 మంది ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మొత్తం రూ.2.5 లక్షల నగదు బహుమతులు, మొమెంటోలు, ప్రశంస పత్రాలు నిర్వాహకులు అందజేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జే.పంగులూరు: యలగాల సుబ్బారావు ప్రతిభ స్మారక పోటీల్లో విజేతలైన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ఈపరీక్షలో చందలూరు పాఠశాలకు చెందిన ఐదుగురు నగదు బహుమతులు సాధించి ఆల్ రౌండ్ చాంపియన్లుగా నిలిచారు.

మార్టూరు: కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 40 మందికి దాతలు సంక్రాంతి సందర్భంగా స్కాలర్ షిప్పులు పంపిణీ చేశారు. గుంటూరులో స్థిరపడిన డాక్టర్ ఈవీ నారాయణ నారాయణ, శ్రీదేవి అక్షర సేవా సమితి తరపున ప్రతి ఏడాది పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తారు. ఒక్కొక్కరికి రూ. 2 వేల 40 మందికి స్కాలర్షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం సతీష్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన యాగం

వేటపాలెం: అణుమల్లిపేటలోని వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రాంగణలో సంక్రాంతి సందర్భంగా గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయం ప్రాంగణలో సుదర్శన యాగం నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమాన్ని ఆలయ పూజారులు దివి సీతారామ చక్రవర్తి పర్యవేక్షించారు. రాపూరిపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవస్థాన ప్రాంగణంలో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, పాధ్యక్షులు గట్టా రమేష్, పేర్ల సుబ్రహ్మణ్యం, దోగుపర్తి బాలకృష్ణ, శ్రీరాం గోవర్ధన్ పర్యవేక్షించారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

చినగంజాం: మండలంలోని గొనసపూడి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం మహిళలకు రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీ నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముగ్గుల పోటీలను సర్పంచ్ దీప్తి ప్రారంభించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతిని మండలంలోని మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన నిదర మాధవి రూ 55 వేలు, ద్వితీయ బహుమతిని ఇరువురికి అందజేయగా గొనసపూడి గ్రామానికి చెందిన బొప్పన సురేఖ రూ 25 వేలు, చీరాలకు చెందిన వీ సుప్రజ రూ.25 వేలు, తృతీయ బహుమతి విజయవాడకు చెందిన ఏ లత, రూ.10 వేలు ,ఏ కోటేశ్వరమ్మ పందిళ్లపల్లి రూ.10 వేలు, వీ వెంకట హిందు రూ.10 వేలు అందుకున్నారు. కార్యక్రమంలో వీరయ్య, నారాయణ, బత్తుల శ్రీను పాల్గొన్నారు.

20 మంది జూదరుల అరెస్టు

చీరాల: సంక్రాంతి పండుగ సందర్భంగా వేర్వేరు చోట్ల జూదం ఆడుతున్న 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పండుగ ముసుగులో జరిగే అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు చీరాల సబ్ డివిజన్ పరిధిలో విస్తృతంగా పోలీస్ పెట్రోలింగ్ చేస్తున్నామని చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్ సోమవారం తెలిపారు. చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేట ప్రసాద్‌నగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు టూటౌన్ ఎస్సై నాగశ్రీనుకు వచ్చిన సమాచారం మేరకు పోలీసు సిబ్బంది దాడి చేశారు. ఇంట్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4320 నగదును స్వాధీనం చేసుకున్నారు.

విఘ్నేశ్వర కాలనీలో 12 మంది..

వేటపాలెం: మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ విఘ్నేశ్వర కాలనీ దగ్గరలో పేకాట శిబిరంపై దాడి చేసి జూదం అడుతున్న 12 మంది అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.16,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మేదరమెట్ల: ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. సోమవారం నెల్లూరు జిల్లా రాజుపాలేనికి చెందిన గోపిరాము మరో వ్యక్తితో కలసి ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపు పల్సర్ బండిపై వెళ్తున్నారు. బైకు మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపానికి రాగానే ముందు వెళ్తున్న కారును బైకు ఢీ కొంది. ఈప్రమాదంలో బైకుపై కూర్చున గోపిరాముకు చేతికి, తలకు తీవ్ర గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులోని వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వాహనం ఢీ కొని..

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన కొరిశపాడు మండలం తిమ్మనపాలెం సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. విజయవాడ వైపు నుంచి ఒంగోలు వైపుకు వెళుతున్న గుర్తుతెలియని వాహనం రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తికి తీవ్రగాయాలు కాగా ప్రైవేటు వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటం వల్ల వ్యక్తి సమాచారం తెలియరాలేదు.

భోగి మంటల్లో కరెంటు బిల్లులు

మార్టూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం వేకు జామున భోగిమంటలతో గ్రామాలు స్వాగతం పలికాయి. కాని విచిత్రంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంపును నిరసిస్తూ కోలలపూడి గ్రామంలో రైతు సంఘం నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో దహనం చేసి తమ నిరసన తెలిపారు.



అద్దంకిలో భోగిమంటల్లో కరెంటు బిల్లులను వేస్తున్న సీపీఎం నాయకులు

అద్దంకి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపైన విద్యుత్ బిల్లుల భారాన్ని మోపిన నేపథ్యంలో సీపీఎం ఆధ్వర్యంలో రెంటు బిల్లులను కాల్చి వినూత్నంగా నిరసన తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ ఈ కార్యక్రమాన్ని పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ పార్టీ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వడ్డనల పర్వం మొదలు పెట్టిందన్నారు. కరెంటు బిల్లులను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో డీ గంగాధర్, బీ విజయ్‌కుమార్, రావులపల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ వర్కర్ సీనియర్ నాయకుడు పీ ఆదాం తదితరులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: చీరాల గాంధీనగర్‌లో సీపీఎం నాయకులు, కార్యకర్తలు విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో తగలబెట్టి వినూత్న నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ఎన్. బాబురావు, ఎమ్. వసంతరావు, జిల్లా కమిటీ సభ్యుడు కొండయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పర్చూరు (చినగంజాం): ఇటీవల పర్చూరులో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం సంభవించి అక్కాచెల్లెళ్ల మృతి చెందిన ఘటనను మరువక ముందే ఆ కుటుంబంలో మరో విషాదం చోటు తేసుకుంది. కన్నకూతుళ్లను కాపాడుకొనే ప్రయత్నంలో మంటల్లో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న తల్లి దాసరి లక్ష్మీరాజ్యం (64) మృతి చెందింది. సోమవారం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతిపై గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.